# ఆడపడుచులు



ఎ. రంగ

సావిత్రి, భర్తా, పిల్లలూ పండగకు పుట్టినింటికి వచ్చేరు. ఆ రాత్రి భోజనాలు అయేక సావిత్రీ పిల్లలు డాబామీద పక్కలు వేసుకుని పడుకున్నారు. సావిత్రిమొగుడు ఫ్రెండుని కలుస్తానని బైటికి వెళ్ళాడు. తల్లి మీనాక్షమ్మ డాబామీదకు వచ్చింది.

“అమ్మాయ్! సావిత్రీ? నిద్రపోతున్నావా?” అంటూ కూతురుకి దగ్గరగా వచ్చి కూర్చుంది మీనాక్షమ్మ. సావిత్రి లేచి కూర్చుంటూ, “లేదమ్మా! రా. ఆయనఇప్పుడప్పుడే ఎలాగూరారు.సంగతులేమిటో చెప్పు.” అంది సావిత్రి.

“నీతో ఓ ముఖ్యమైన సంగతి చెపుదామని వచ్చేను. కోడలు పడుకుంది. వాడు వచ్చేవరకూ లేవదు. ఇదే సమయమని వచ్చేను” అంది మీనాక్షమ్మ ఆయాసపడుతూ.

“చెప్పమ్మా!” అంది సావిత్రి కుతూహలంగా.

“అన్నయ్యకు క్రితంనెల 'ఎరియర్స్' బాపతు సొమ్ము కొంత, 'బోనస్' బాపతు సొమ్ము కొంత వచ్చింది. మొత్తం అంతా వెయ్యి వరకూ ఉండచ్చులే. నీకూ, పిల్లలకీ, అల్లుడికీ మొత్తం రెండువందలో మూడువందలో బహుమతిగా యిచ్చేసి పండుగయిం దనిపించేసేలా వున్నాడు. వాళ్ళ ఆలోచన అలా వుంది. అలా రెండు వందలు, మూడువందలు యిస్తే మాత్రం కక్కుర్తిపడి పుచ్చేసుకోకు. ఐదు వందలకు తక్కువ యిస్తే పుచ్చుకోకు.వద్దని నిర్మొహమాటంగా చెప్పెయ్యి వదినకి. అన్నయ్యకి కూడా.

ఐదు వందలు వాడిస్తే, దానికి తోడు మరో ఐదు వందలు మీ దగ్గరున్న బోనస్ డబ్బు వేసుకుని శుభ్రంగా మువ్వూ. పిల్లలూ వెయ్యి రూపాయలు పెట్టి బట్టలు కొనుక్కోవచ్చు. లేదా అరతులం బంగారం అయినా వస్తుంది. చంటిదానికి పనికివస్తుంది.

ఇంతకూ అల్లుడు బోనస్ డబ్బు వుంచేడా? ఖర్చు చేసేశాడా?” కూతురికి హితబోధలు చేయటం అయిన తర్వాత, అల్లుడి బోనస్ డబ్బు గురించి ఆరా తీసింది మీనాక్షమ్మ.

“ఖర్చు చేసేద్దామనే చూసేరమ్మా మీ అల్లుడు. మా ఆడపడుచు సీతకి, పిల్లలకి, బట్టలు కొనేద్దామని చూసేరు. నేనావేషాలు సాగనివ్వలేదు. ఆ “బోనస్” డబ్బు నేను పుచ్చుకుని దాచేశాను. ఇప్పుడా సొమ్ము నా దగ్గరేవుంది. ఏమనుకున్నారో ఏమో, ఇక నోరు మూసుకుని వూరుకున్నారు. లేకపోతే మా ఆడపడుచూ. పిల్లలూ నానెత్తియెక్కి కూర్చుని పండగ, పబ్బం జరుపుకుని వెళ్ళేవారే! నేనే ఎలాగో తప్పించివేసేను.” అంది సావిత్రి అక్కసుగా.

“మంచిపని చేశావుతల్లీ!నువ్వేమయినా గొడ్డుమోతుదానవా, ఏమైనానా? పిల్లా, జెల్లా వున్నదానివి. 'ఆడపడుచు' నంటూ ఎన్నాళ్ళని ముద్దూ ముచ్చట్లు జరుపుకుంటుంది? 'ఆశ'కు అంతు ఎక్కడా? డబ్బు వదలకు, జాగ్రత్త.” మరోసారి హితవు చెప్పింది మీనాక్షమ్మ.

మర్నాడు సావిత్రి గదిలో పెట్టె సర్దుతోంది. సావిత్రి మొగుడు ప్రకాష్ గదిలోకి వచ్చి, తలుపులు గడియ పెట్టి, సావిత్రికి దగ్గరగా వచ్చి కూర్చున్నాడు.

**మినీ కథా వీధి**

“సావిత్రీ! మీ అన్నయ్య పండగ బహుమతిగా మనకు నాలుగు వందలు యిచ్చేడు. మరోవంద ఇద్దామనుకున్నాడట. కాని అతనికేవో చిల్లర అప్పులు ఉన్నాయట. అందుకు ఏమీ అనుకోవద్దు అన్నాడు. మరింక అతనిని బాధపెట్టడం ఎందుకని నాలుగొందలు తీసుకున్నాను.

దానికితోడు నా దగ్గరున్న మన బోనస్ డబ్బులో నాలుగు వందలు తీసియివ్వు. నాకూ, నీకు, పిల్లలకీ మంచి బట్టలు కొని తెస్తాను. నాకింకా రావలసిన సొమ్ము వుంది. ఆ సొమ్ము, నీ దగ్గర యింకా మిగిలిన సొమ్ము కలిపి, తర్వాత బంగారం కొందాం. మన బేబీకి పనికి వస్తుంది. ప్రస్తుతం నాలుగు వందలివ్వు చాలు. నా ప్లాను యిలా వుంది. ఏమంటావ్?” ప్రకాష్ అడిగేడు.

“మీ ప్లాను బాగానే వుంది. కాని షాపింగుకి నేనూ వస్తాను” అంది సావిత్రి.

“అసలే ఈ ప్రయాణంతో అలసిపోయి వున్నావు. కాసేపు 'రెష్టు'తీసుకో. ఈ సాయంత్రం వీలయితే, అంతా కలసి పిక్చరుకి వెళదాం. నేనూ, మీ అన్నయ్య కలసి షాపింగు ముగించుకుని పెందరాళే వచ్చేస్తాము. ఒక వేళ నీకు చీర నచ్చకపోతే, వాపసు యిచ్చేద్దాం. మీ అన్నయ్యకు బాగాతెలిసిన షాపుకే వెళుతున్నాం. సరేనా!” అన్నాడు ప్రకాష్.

రెండుసార్లు తిరగటం దేనికని సావిత్రి కూడా భర్తచెప్పినట్లుగా విని, నాలుగు వందలుతీసి ప్రకాష్ చేతిలో పెట్టింది.

ప్రకాష్ డబ్బుని పాంటు జేబులో పెట్టుకున్నాడు. సావిత్రిని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. గదిలోంచి బైటకు వచ్చి బావమరిదితో కలిసి బజారుకు వెళ్ళేడు.

మధ్యాహ్నం భోజనాల వేళకు ఎనిమిది వందల రూపాయల బట్టలు ఇంటికి తీసుకువచ్చేరు బావ,బావమరదులు కలిసి.

నాలుగు వందల రూపాయల బట్టల ప్యాకెట్లు సావిత్రికి అందించి మరో నాలుగు వందల రూపాయల బట్టలపాకెట్లు వేరుగా పెట్టెలో పెట్టి తాళం వేసేడు ప్రకాష్.

“అవెవరికి? వేరుగా దాస్తున్నావెందుకు?” సావిత్రి ఆదుర్దాగా ఆరాగా అడిగింది.

“అవి మా చెల్లి సీతకు, పిల్లలకు. ఏ పుట్టినింటి ఆడపడుచుకయినా ఆశ వుండటం సహజం, న్యాయం. ఏ పుట్టినింటి ఆడపడుచు ఆశయినా ఒకటేకదా! ఏమంటావ్?” ప్రకాష్ సావిత్రికేసి సూటిగా చూసేడు.

సావిత్రి ముఖంలో రక్తపుబొట్టు లేదు.